ముస్లింల సంక్షేమానికి ఎంతో కృషి చేశాం

కూకట్‌పల్లి బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి మాధవరం కృష్ణారావు



ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరిన బీజేపీ నాయకుడు రవియాదవ్



అల్లాపూర్ డివిజన్‌లో ముస్లింల ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే అభ్యర్థి మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ సబిహా బేగం



భారీగా హాజరైన ముస్లింలు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి మాధవరం కృష్ణారావు మంగళవారం అల్లాపూర్ డివిజన్ పండిట్ నెహ్రూనగర్‌లో ముస్లింలతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముస్లింల సంక్షేమానికి బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను తీసుకొచ్చిందన్నారు. షాదీముబారక్, మసీదుల్లో పనిచేసే వారికి జీతభత్యాలు ఇస్తూ వారికి ఆర్థిక భరోసా ఇస్తోందన్నారు. పదేళ్లుగా హిందూ, ముస్లింల గొడవలు లేకుండా చూస్తున్నారని అన్నారు. రానున్న ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కర్యాక్రమంలో కార్పొరేటర్ సబిహా బేగం, మైనార్టీ నాయకులు, కార్యకర్తలు, ముస్లింలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లోకి బీజేపీ నేత రవియాదవ్

బీజేపీ యువ మోర్చా మూసాపేట డివిజన్ అధ్యక్షుడు, మారుతీనగర్ బూత్ ప్రెసిడెంట్ రవియాదవ్ మంగళవారం బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా మూసాపేట మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో మాధవరం కృష్ణారావును కలిశారు. ఈ సందర్భంగా మాధవరం కృష్ణారావు ఆయనకు గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో అంబటి శ్రీనివాస్, అయిలయ్య యాదవ్, రాము, తూము నిఖిల్, జిల్లా అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

ఓ వైపు సతీమణి ప్రచారం

కూకట్‌పల్లి: బాలానగర్ డివిజన్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి మాధవరం కృష్ణారావుకు మద్దతుగా ఆయన సతీమణి లక్ష్మీబాయి ప్రచారం చేశారు. ఇంటింటికీ వెళ్లి కారు గుర్తుకు ఓటు వేసి మాధవరం కృష్ణారావును గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కృష్ణారావు దృష్టికి ఏ సమస్య వచ్చినా దానిని పరిష్కరించే వరకు వెనకడుగు వేయరన్నారు. మాకు ఈ పథకం అందడం లేదు సార్ అని అడిగిన వెంటనే వారికి ఆ పథకం అందేలా కృషి చేస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా అధ్యక్షురాలు అనిత శ్రీపాద్, ప్రభారెడ్డి, స్వాతి, సుజాతగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మరోవైపు తనయుడి ప్రచారం



కూకట్‌పల్లి: బీఆర్ఎస్ అభ్యర్థి మాధవరం కృష్ణారావు తనయుడు మాధవరం సందీప్‌రావు మంగళవారం ప్రచారం నిర్వహించారు. ఫతేనగర్ డివిజన్ కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్‌తో కలిసి ఇంటింటికీ వెళ్లి కారు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. గౌతమ్‌నగర్ పురవీధుల్లో తిరుగుతూ స్థానికులను పలకరించారు. ప్రభుత్వం నుంచి అందుతున్న సంక్షేమ పథకాల గురించి తెలుసుకున్నారు. ఈ పథకాలు నిరాటంకంగా కొనసాగాలంటే అధికారంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఉండాలన్నారు. అందుకే ఈసారి కృష్ణారావుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు.

మాధవరం గెలుపు... ప్రజల జీవితాల్లో వెలుగు

ఓల్డ్‌బోయిన్‌పల్లి: మాధవరం కృష్ణారావు గెలుపుతో ప్రజల జీవితాలలో వెలుగు నిండుతాయని ఓల్డ్‌బోయిన్‌పల్లి బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి మేకల హరినాథ్ అన్నారు. మంగళవారం డివిజన్‌లోని రామరాజునగర్, స్వర్ణధామనగర్ ప్రాంతాలలో నాయకులు, కార్యకర్తలు, మహిళలతో కలసి పాదయాత్ర నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను అందించి మాధవరం కృష్ణారావు చేసిన అభివృద్ధిని వివరించారు. సంక్షేమ పథకాల గురించి వివరిస్తూ కారు గుర్తుకే ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కర్రె జంగయ్య, బాల్‌రాజు, పిట్ల రాజు, మల్లేష్‌యాదవ్, మన్నే ఉదయ్‌యాదవ్, మక్కాల సత్యనారాయణ, కృష్ణారెడ్డి, బుర్రి యాదగిరి, కనకదాస్, వేణుగోపాల్‌రెడ్డి, లలితా, ఉదయరాణి, సరోజదేవి, కర్రె లావణ్య, సంతోషి, అనురాధ, శశికళ, రోజా, స్వరూప తదితరులు పాల్గొన్నారు.



రామరాజునగర్, స్వర్ణధామనగర్‌లలో జోరుగా ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



కాంగ్రెస్‌తోనే పేదల బతుకులు మారతాయి



అల్లాపూర్ డివిజన్‌లో ప్రచారం చేస్తున్న బండి రమేష్, సత్యం శ్రీరంగం తదితరులు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి నియోజకవర్గం బాలాజీనగర్ డివిజన్‌లో అధ్యక్షుడు కృష్ణ రాజ్‌పుత్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని మంగళవారం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బండి రమేష్, ఎన్నికల ఇన్‌చార్జి డా.సత్యం శ్రీరంగం, బ్లాక్ అధ్యక్షుడు పి. నాగిరెడ్డి, తూము వేణులతో కలిసి ప్రాంభించారు. అనంతరం డివిజన్‌లోని ఆంజనేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అల్లాపూర్ డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ నర్సింహయాదవ్ ఆధ్వర్యంలో ఇంటిరిటి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ నాయకులు మోసపూరిత మాటలతో ప్రజలను మభ్య పెడుతున్నారని అన్నారు. నమ్మితే మూడోసారి మోసపోవటం ఖాయమన్నారు. కాంగ్రెస్‌తోనే పేదల బతుకులు మారతాయని.. చేతి గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.



బాలాజీనగర్ డివిజన్‌లో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న బండి రమేష్

దివ్యాంగులకు ఓటర్ అవగాహన కార్యక్రమం



ఓటు హక్కుపై దివ్యాంగులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న దివ్యాంగులు

కూకట్‌పల్లి: జిల్లా ఎన్నికల అధికారి, మేడ్చల్–మల్కాజిగిరి కలెక్టర్ ఆదేశాల మేరకు స్వీప్‌లో భాగంగా కూకట్‌పల్లి నియోజకవర్గంలో మూసాపేట ప్రాంతంలో మంగళవారం దివ్యాంగులకు ఓటర్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాల వికాస ఎడ్యుకేషన్ సొసైటీ వారి ఆధ్వర్యంలో న్యూశక్తి దివ్యాంగుల సంస్థ అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఓటు ప్రాముఖ్యత, పోలింగ్ కేంద్రం దగ్గర దివ్యాంగులకు ప్రత్యేక వసతులు ఏర్పాటు చేసిన ర్యాంపు వీల్ చైర్, ఎస్కార్ట్ గురించి దివ్యాంగులకు వివరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మేడ్చల్ జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ యాదగిరి, స్వీట్ రీసోర్స్ పర్సన్స్ శ్రవణ్, మునిస్వామి, బాలవికాస్ ఫౌండర్ చైర్మన్ శ్యాంసుందర్, ఫ్యూడ్ చైర్మన్ గంగరాము సెక్రటరీ నాగభూషణం, నియోజకవర్గం అధ్యక్షులు వేల్పుగొడం వెంకటస్వామి, ప్రధాన కార్యదర్శి చిరంజీవి, దివ్యాంగులు తదితరులు పాల్గొన్నారు.

'ఫర్ పీపుల్ హు మూవ్' లో అఖిల్ అక్కినేని

సాక్షి సిటీబ్యూరో: వినూత్న మార్గాలను ఎంచుకుని చరిత్ర సృష్టించే వ్యక్తుల విజయగాథల్ని తెలియజెప్పేందుకు యూకేకి చెందిన ప్రముఖ పాదరక్షల బ్రాండ్ ఫిట్‌ఫ్లాప్ 'ఫర్ పీపుల్ హు మూవ్' పేరిట సరికొత్త ప్రచార కార్యక్రమాన్ని రూపొందించింది ఈ ప్రచార కార్యక్రమంలో టాలీవుడ్ హీరో అఖిల్ అక్కినేని, ఫ్యాషన్ రంగానికి చెందిన నందినీ భల్లా, వెడ్డింగ్ ఫొటోగ్రాఫర్ జోసెఫ్ రాధిక్ తదితరులు కీలకపాత్ర పోషిస్తున్నారని, దేశవ్యాప్తంగా ఇది నిర్వహిస్తున్నామని మెట్రో బ్రాండ్స్ లిమిటెడ్ ప్రతినిధులు తెలిపారు.

ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలి

మేడ్చల్‌రూరల్: విద్యార్థులు ఉద్యోగాలు చేసే స్థాయి నుంచి ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలని ఎంఎస్ఎంఈ అసిస్టెంట్ డైరెక్టర్ కేసీ చౌదరి అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని నర్సింహారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో నూతన ఆవిష్కరణలు, వ్యవస్థాపకతపై అవగాహన సదస్సు నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం అందించే ప్రధాన మంత్రి ఎంప్లాయ్ గ్యారంటీ ప్రోగ్రాం, ముద్ర లోన్స్, స్టార్టప్ ఇండియా వంటి పథకాలను వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నేటి విద్యార్థులు భవిష్యత్‌లో ఉద్యోగాలు కల్పించే స్థాయిలో ఉండాలని, అందుకు అనుగుణంగా ప్రతిభను మెరుగు పర్చుకోవాలన్నారు. స్టార్టప్ ఇండియా ద్వారా ఎన్నో స్టార్టప్స్‌కి ఊతం లభించిందని, నూతన ఆవిష్కరణలతో విద్యార్థులు ముందుకు వస్తే వాటి పేటెంట్ దిశగా ఎంఎస్ఎంఈ సహకారం అందిస్తుందని వివరించారు. సేవ, ఉత్పత్తి రంగాల్లో ఎంఎస్ఎంఈ పాత్ర ఎంతో ఉందని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ నర్సింహారెడ్డి, కార్యదర్శి త్రిశూల్‌రెడ్డి, కోశాధికారి త్రిలోక్‌రెడ్డి, ప్రిన్సిపాల్ లోకనాథం, డైరెక్టర్ మోహన్‌బాబు, కో ఆర్డినేటర్ శోభన్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



కళాసిల్క్ హ్యాండ్లూమ్ ఎగ్జిబిషన్‌కు స్పందన

కూకట్‌పల్లి: నిజాంపేట రోడ్డులోని కొలన్ నారాయణ రెడ్డి గార్డెన్స్‌లో కళాసిల్క్ హ్యాండ్లూమ్ ఇండియా వారి ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. ఈ ఎగ్జిబిషన్‌లో అన్ని రకాల చేనేత కళాకారులతో నేయబడిన కాటన్ చీరలు, చేనేత వస్త్రాలు అందుబాటులో ఉంచామని నిర్వాహకులు వినోద్ తెలిపారు. దేశంలోని వివిధ రాష్ట్రాలో కళాకారులతో తయారు చేసిన చేనేత వస్త్రాలు అందుబాటులో ఉంచామన్నారు. వివాహాలకు, శుభకార్యాలకు సంబంధించిన అన్ని రకాల వస్త్రాలు లభించునని తెలిపారు. చేనేత కళాకారులకు అండగా నిలవడానికి ఇటువంటి ఎగ్జిబిషన్లు ఉపయోగపడుతాయని అన్నారు. ఎగ్జిబిషన్ ద్వారా కొనుగోలుదారులకు నాణ్యమైన వస్తువులు అందజేయనున్నట్లు తెలిపారు. వస్త్ర మేళాల ద్వారా చేనేత కార్మికులకు ఎన్నో ఉపాధి అవకాశాలు ఉంటాయని పేర్కొన్నారు.



కొనుగోలు చేస్తున్న వినియోగదారులు

మహిళలకు ఉచిత శిక్షణతో పాటు ఉపాధి ఇస్తున్నాం

మూసాపేట: ఎస్. సంజీవరెడ్డి ఫౌండేషన్‌లో మహిళలకు ఉచిత టైలరింగ్, బ్యూటీషియన్‌లపై ఉచిత శిక్షణ, ఉపాధి కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా మంగళవారం 16 మంది మహిళలు నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు నేర్చుకునేందుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా స్మాల్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డీజీఎం ఆర్.ప్రభావతి ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... మహిళలు ఏదైనా ఒక వృత్తిని నేర్చుకొని వారి కాళ్లమీద వారు నిలబడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు స్వాతి, అరుంధతి, ఎస్ఐడీబీఐ అసిసెంట్ మేనేజర్ డా. డి.శివకుమార్, సంస్థ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఎస్.సంజీవరెడ్డి ఫౌండేషన్‌లో శిక్షణ పొందుతున్న మహిళలతో డీజీఎం ఆర్.ప్రభావతి

ఆస్పత్రి యాజమాన్యం బాధ్యత తీసుకోవాలి

మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్

మూసాపేట: మూసాపేటకి చెందిన చిన్నారి జి. పల్లవి ఊపిరితిత్తుల సమస్యతో బాధపడుతూ అమోర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఆపరేషన్ చేసిన తర్వాత కంటి చూపు కోల్పోవడంతో బాధితులు మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్ దృష్టికి తీసుకొచ్చారు. మంగళవారం ఆయన ఆస్పత్రికి వెళ్లి యాజమాన్యంతో మాట్లాడారు. ఎలాంటి బిల్లు లేకుండా కంటి చూపు వచ్చే వరకు యాజమాన్యం బాధ్యత తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నర్సింగ్‌రావు, చున్నూ పాషా, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.



ఆస్పత్రి వైద్యులతో చర్చించి వారి నుంచి హామీ తీసుకుంటున్న శ్రావణ్‌కుమార్

ముమ్మారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలి

మేడ్చల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు పన్నాల హరీష్‌రెడ్డి

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి నియోజకవర్గం ఫతేనగర్ డివిజన్, భరత్‌నగర్ కాలనీ, భవానినగర్, హెచ్‌పీ రోడ్, ప్రభాకర్‌రెడ్డినగర్, జింకలవాడ, సమతానగర్‌లలో మంగళవారం ఎన్నికల ప్రచారంలో బీజేపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి ముమ్మారెడ్డి ప్రేమకుమార్‌తో కలిసి బీజేపీ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు పన్నాల హరీష్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... గాజుగ్లాసు గుర్తుపై ఓటు వేసి అఖండ విజయం అందివ్వాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఫతేనగర్ డివిజన్ పైపులైన్ రోడ్డు దగ్గర ఎన్నికల జనసేన పార్టీ కార్యాలయాన్ని మంగళవారం జనసేన అభ్యర్థి ముమ్మారెడ్డి ప్రేమ కుమార్ ప్రారంభించారు. మాజీ కార్పొరేటర్ కృష్ణాగౌడ్, డివిజన్ అధ్యక్షుడు ఉదయ్‌ల ఆధ్వర్యంలో 100 మంది జనసేన పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో మహేందర్, రాజు, రఘు, సందీప్, మల్లేష్, రేవప్ప, నరేష్, ప్రమోద్, గోపాల్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ఆశీర్వదించండి.. మరింత అభివృద్ధి చేస్తా..

బీఆర్‌యస్ పార్టీ అభ్యర్థి అరెకపూడి గాంధీ

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్ డివిజన్ పరిధిలోని వెంకటేశ్వరనగర్, ఆల్విన్‌కాలనీ ఫేజ్ 1, మాధవరంనగర్, కమల ప్రసన్ననగర్‌లలో బీఆర్‌యస్ పార్టీ అభ్యర్థి అరెకపూడి గాంధీ మంగళవారం కార్పొరేటర్ రోజాదేవి రంగారావుతో కలిసి ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలే బీఆర్‌యస్ పార్టీకి శ్రీరామరక్ష అని, విజయం తథ్యమన్నారు.

పార్టీ కార్యాలయం ప్రారంభం

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్ డివిజన్ పరిధిలో ఏడిఆర్ ఎస్టేట్స్‌లో బీఆర్‌యస్ పార్టీ డివిజన్ కార్యాలయాన్ని శేరిలింగంపల్లి అభ్యర్థి అరెకపూడి గాంధీ, కురమయ్యగారి కొండల్‌రావు, దామోదర్‌రావు, స్థానిక కార్పొరేటర్ రోజాదేవితో కలిసి మంగళవారం ప్రారంభించారు. అనంతరం రిక్షాపుల్లర్స్ కాలనీ, రామకృష్ణనగర్, వెంకటేశ్వరనగర్, వీకర్ సెక్షన్, ఆల్విన్‌కాలనీ, మాధవరం కాలనీ, కమల ప్రసన్ననగర్‌లలో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నుంచి బీఆర్‌యస్‌లో చేరిన కె. శ్రీకాంత్, మధు, ఆయన మిత్రమండలికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, డివిజన్ అధ్యక్షుడు సంజీవరెడ్డి, గొట్టిముక్కల పెద్ద భాస్కర్ రావు, నాయినేని చంద్రకాంత్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పార్టీలో చేరిక

కూకట్‌పల్లి: వివేకానందనగర్ డివిజన్ పరిధిలోని వెంకటేశ్వరనగర్‌కు చెందిన సీనియర్ కాంగ్రెస్ నేత మధు ముదిరాజ్, వ్యాపారవేత్త శ్రీకాంత్‌గుప్తలు మంగళవారం బీఆర్‌యస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి గాంధీ, స్థానిక కార్పొరేటర్ మాధవరం రోజాదేవి రంగారావుల ఆధ్వర్యంలో సుమారు 50 మంది నాయకులు, యువకులు బీఆర్‌యస్‌లో చేరారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, డివిజన్ అధ్యక్షుడు సంజీవరెడ్డి, నాయకులు నాయినేని చంద్రకాంత్‌రావు, గొట్టిముక్కల పెద్ద భాస్కర్‌రావు, మొలుగు హిమగిరిరావు, లక్ష్మీనర్సయ్య, హరనాథ్, కార్తీక్‌రావు, ఉపేందర్ గుప్త తదితరులు పాల్గొన్నారు.

6 గ్యారంటీలను కాంగ్రెస్ అమలు చేస్తుంది

పార్టీ అభ్యర్థి జగదీశ్వర్ గౌడ్

ఆల్విన్‌కాలనీ: మాధవరంనగర్‌లో శేరిలింగంపల్లి కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థి జగదీశ్వర్ గౌడ్ మంగళవారం పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి వెంటనే ఆరు గ్యారంటీలను అమలు చేస్తుందన్నారు. హస్తం గుర్తుకు ఓటు వేసి గెలింపించాలని కోరారు. అదే విధంగా జగదీశ్వర్‌గౌడ్‌కు మద్దతుగా పార్టీ సీనియర్ నాయకులు బాషిపాక యాదగిరి మాదిగ వెంకటేశ్వరనగర్‌లో ప్రచారం చేశారు.

పోస్టల్ బ్యాలెట్ ఓట్లు వేసిన పోలీసులు

గచ్చిబౌలి: శేరిలింగంపల్లి జీహెచ్ఎంసీ కార్యాలయంలో మంగళవారం శేరిలింగంపల్లి ఆర్డీఓ శ్రీనివాస్‌రెడ్డి పర్యవేక్షణలో పోలీసులు పోస్టల్ బ్యాలెట్ ఓటు వేశారు. ఈ కార్యక్రమాన్ని ఆయన స్వయంగా ఇతర అధికారుల సహకారంతో పర్యవేక్షించారు. ఈ సందర్భంగా 126 మంది పోలీసులు పోస్టల్ బ్యాలెట్ ఓట్లను వేశారు. ఎన్నికల విధులు నిర్వహించే అవకాశం ఉండడంతో వారికి పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసే అవకాశం కల్పించిన విషయం తెలిసిందే.



పోస్టల్ బ్యాలెట్ ఓట్లు వేస్తున్న పోలీసులు, పర్యవేక్షిస్తున్న శేరిలింగంపల్లి ఆర్డీఓ శ్రీనివాస్‌రెడ్డి

పూర్తయిన ర్యాండమైజేషన్ ప్రక్రియ

సాక్షి, మేడ్చల్ జిల్లా: శాసనసభ ఎన్నికలకు సంబంధించి మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో మొదటి విడత ర్యాండమైజేష్ ప్రక్రియను వివిధ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పూర్తి చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ తెలిపారు. అలాగే, జిల్లాకు కేటాయించిన అదనపు బ్యాలెట్ యూనిట్ల పరిశీలన కూడా పూర్తయ్యిందన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ, రాజకీయ పార్టీల నాయకులతో కలిసి ర్యాండమైజేషన్ ప్రక్రియను జిల్లా ఎన్నికల అధికారి గౌతమ్ పూర్తి చేశారు. మల్కాజిగిరి, ఉప్పల్ శాసనసభ నియోజకవర్గాలకు అదనపుంగా బ్యాలెట్, కంట్రోల్ యూనిట్లు అవసరం కాగా, మల్కాజిగిరి నియోజకవర్గానికి 1,096 బ్యాలెట్ యూనిట్లు, 23 కంట్రోల్ యూనిట్లు, ఉప్పల్ నియోజకవర్గానికి 1,060 బ్యాలెట్ యూనిట్లు, 15 కంట్రోల్ యూనిట్లు కేటాయించి ర్యాండమైజేషన్ ప్రక్రియను పూర్తి చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

అసెంబ్లీ ఎన్నికలకు పూర్తి ఏర్పాట్లు చేయండి

శాసనసభ ఎన్నికలకు సంబంధించి ఐదు నియోజకవర్గాల్లో పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేసేలా అవసరమైన చర్యలను ముందస్తుగా చేపడుతున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ తెలిపారు. ఈ విషయంలో అధికారులకు అవసరమైన సూచనలు జారీ చేశామన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా ఎన్నికల పరిశీలకులు పూర్వాగార్గ్, అమన్మిట్టల్‌తో కలెక్టర్ గౌతమ్ ఎన్నికల ఏర్పాట్లపై ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ప్రతి నియోజకవర్గంలో ఎన్నికలు ప్రశాంతంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో జరిగేలా అవసరమైన చర్యలు చేపట్టామన్నారు. ఎన్నికల పరిశీలకులు పూర్వాగార్గ్, అమన్ మిట్టల్ కలెక్టరేట్లో ఏర్పాటు చేసిన మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ (ఎంసీఎంసీ) కేంద్రాన్ని ఈ సందర్భంగా పరిశీలించారు. ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాలో ఎన్నికల ప్రకటనలకు సంబంధించి జిల్లా మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ, ఎన్నికల సంఘం విడుదల చేసిన రేట్ల ప్రకారం ఎన్నికల వ్యయం నమోదు చేస్తున్న తీరుతో పాటు రోజు వారి నివేదికల నిర్వహణ, పెయిడ్ న్యూస్ కేసుల వివరాలను వారు అడిగి తెలుసుకున్నారు.

పోలింగ్ నిర్వహణకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్

సాక్షి, మేడ్చల్ జిల్లా: శాసనసభ ఎన్నికలకు సంబంధించి మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో ఎన్నికల కమిషన్ సూచనలు తప్పకుండా పాటిస్తున్నామని, 30 జరిగే పోలింగ్ నిర్వహణకు కూడా అవసరమైన కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్ రాజ్, జాయింట్ ప్రధాన ఎన్నికల అధికారి సర్ఫరాజ్ అహ్మద్, ఉన్నత స్థాయి అధికారులతో ఆయన మాట్లాడారు. ఎన్నికల ఏర్పాట్లపై నియోజకవర్గాల వారిగా రిటర్నింగ్ అధికారులతో సమావేశాన్ని నిర్వహించినట్లు ఆయన పేర్కొన్నారు. పోలింగ్ కేంద్రాల్లో వెబ్ క్యాస్టింగ్‌కు సంబంధించి ముందస్తుగానే ఏర్పాట్లు చేశామన్నారు. జిల్లాలో నూతన ఓటర్లకు గుర్తింపు కార్డులు పంపిణీ చేయడంతో పాటు ప్రతి ఓటరుకు సమాచార స్లిప్పులు పంపిణీ చేస్తున్నామని, అందుకు సంబంధించి ప్రతిరోజూ నివేదిక కోరుతున్నట్లు పేర్కొన్నారు. పోలింగ్ రోజు విధులు నిర్వహించే ప్రభుత్వ ఉద్యోగులు, ఇతర సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. జిల్లాలోని ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఈవీఎమ్ యంత్రాల ర్యాండమైజేషన్ పూర్తయిందన్నారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘనలపై వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో ఎంసీసీ నోడల్ అధికారి కృష్ణారెడ్డి, పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారి వంశీమోహన్, జిల్లా ఎన్నికల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.